# వెట్టై - 2
## ( ది వారియర్)



# మధుబాబు

# వెట్టి-2
## (ది వారియర్)

**విల్‌పవర్‌నంతా కూడగట్టుకుని, తను విసరబోతున్న రాయిని మధ్యలోనే ఆపాడు వెట్టి. బిగపట్టి ఉంచిన ఊపిరిని కూడా తేలికగా బయటికి వదిలేశాడు.**

**"నీకు ఒళ్లు బలిసిందిరా. ఎప్పుడుపడితే అప్పుడు ఫోన్లు చేయడం ఎక్కువైపోయింది" అంటున్నాడు షెడ్‌కి కొంచెం అవతలికి పోయిన పఠాన్. అవతలి పక్కనుంచి ఎటువంటి మాటలు వినబడ్డాయో తెలియదు గాని, "అలాగా... అయితే సరే, నేను వెంటనే వచ్చేస్తాను. పదిగంటలయ్యేసరికి అక్కడ ఉంటాను" అంటూ ఫోన్ ఆఫ్‌చేసి ప్యాంటు జేబులో పెట్టుకుని, మళ్ళీ షెడ్‌లోకి వచ్చాడు.**

ప్రశ్నార్థకంగా చూశారు షెడ్‌లో ఉన్నవాళ్ళందరూ.

"చింతలపల్లి నుంచి చేశాడు నాగులు. అక్కడ మనవాళ్లు చేస్తున్న పని గురించి ఫారెస్టు డిపార్ట్‌మెంట్ వాళ్ళకి అనుమానం వచ్చిందిట. నన్ను వెంటనే రమ్మని అంటున్నాడు" లోపల పెట్టుకున్న ఫోన్ తడుముకుంటూ చెప్పాడు అతను.

"వెంటనే రమ్మంటున్నాడా? అయితే మీరు వెళుతున్నారా?" అడిగాడు బసవప్ప.

"వెళ్ళాలి కదా బసవప్ప. ఒకటి కాదు రెండు కాదు. పదికోట్లకి సంబంధించిన పని. తేడావస్తే మా నాన్న నా తెలివిని తిట్టిపోస్తాడు" నుదురు రుద్దుకుంటూ చెప్పాడు పఠాన్.

"మరి ఇక్కడి పని? దాన్ని కూడా మీ నాన్నగారే నాకు అప్పచెప్పారు. ఇక్కడ తేడా వచ్చినా తప్పవు కదా తిట్లు?" అడిగాడు బసవప్ప.

"నువ్వు ఉన్నావు కదా బసవప్పా! ఆడిని మా వాళ్లు నీకు చూపిస్తారు. నువ్వు ఏం చెపితే అది చేసేస్తారు. అదీకాక..." అంటూ మాటని ఆపాడు పఠాన్.

"ఆగిపోయావేంటి? ఏమిటోచెప్పు" ప్రాంప్ట్ చేశాడు బసవప్ప.

"ఆడు ఎవడో, ఎక్కడినుంచి వచ్చి మమ్మల్ని తగులుకున్నాడో మాకు తెలియదు. ఒకవేళ వాడు మీకు కావాల్సినవాడే అయితే, ఇది ఖచ్చితంగా మీ పనే అవుతుంది. ఆడిని ఎట్టా మడతపెట్టేయాలో మాకంటే నీకే బాగా తెలుసు" అన్నాడు పఠాన్.

సాలోచనగా తల ఊపాడు బసవప్ప. "నీ మాటలు నిజమే. ఆడు మాకు కావాల్సినవాడే అయితే భలే రంజుగా ఉంటది. ఆడు తప్పించుకుని పారిపోయి వచ్చిన దగ్గర్నించీ మా ఓనర్స్‌కి కంటిమీద కునుకు లేదు. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియక ఒకటే కంగారుపడిపోతున్నారు" అంటూ రెండు క్షణాలు ఆగి, "సరే... నువ్వెళ్ళిరా. ఇక్కడి యవ్వారం నే జూసుకుంటా" అన్నాడు.

"అరేయ్.... జాగ్రత్తగా ఉండండి. ఆడిని దూరంలో ఉండగానే బసవప్పకి చూపించండి" అంటూ షెడ్‌లో నుంచి మెయిన్‌రోడ్డు మీదికి పోయాడు పఠాన్.

"చిన్నసారు జీప్‌కారును తీసుకుపోతే, మన పరిస్థితి ఏంటి?" అతను ఏం చేయబోతున్నాడో అర్థమై అనుమానంగా అడిగాడు ఒక దృఢకాయుడు.

"మరేం ఫరవాలేదు. పని పూర్తయిన తర్వాత ఆలోచిద్దాం. అంతగా అయితే బాజిరెడ్డి సారుకు ఫోనుచేసి ఇంకో కారు తెప్పించుకుందాం. పని పూర్తి అవటం ముఖ్యం" సిమెంట్ బెంచీ వెనుక ఉన్న గోడకు చేరగిలబడుతూ అన్నాడు బసవప్ప.

పరుగులాంటి నడకతో వెళ్లాడు కాబోలు ఇరవై సెకండ్లలో రోడ్డుకు చేరుకుని వెహికల్‌ని స్టార్ట్ చేశాడు పఠాన్.

దట్టంగా ఎదిగి ఉన్న పొదల్లో చేరి అప్పుడప్పుడు కీచు ధ్వనులు చేస్తున్నాయి రకరకాల పురుగులు. ఆ చప్పుడు తప్ప మరే విధమైన శబ్దమూ వినిపించని ఆ వేకువ సమయంలో చాలాపెద్దగా వినవచ్చింది ఆ వెహికల్ కదిలి, వేగంగా వెళ్లిపోతున్న చప్పుడు.

"మేము రోడ్డుమీదికి పోయి నిలబడతాం. వాడు వస్తున్న సద్దు చెవులపడగానే వచ్చి చెపుతాం" అంటూ వెంటనే రోడ్డుమీదికి బయలుదేరారు షెడ్‌లో నిలబడిన వారిలో ఒక నలుగురు.

ఒకటి నుంచి వంద వరకూ మనసులోనే లెక్కబెట్టి, వాళ్లు దూరంగా వెళ్లిపోయారని నిశ్చయం కాగానే, సిద్ధంగా పట్టుకుని ఉన్న రాయిని బలంగా విసిరాడు వెట్టి. ఫట్‌మని పగిలిపోయింది గుడ్డిగా వెలుగుతున్న బల్బు. అప్పటివరకూ ఎంతో కొంత వెలుగుతో నిండి ఉన్న ఆ ప్రదేశం ఒక్కసారిగా చీకటిమయం అయిపోయింది.

"ఏంటిరా? ఏంటది? ఏమైంది లైటుకి?" కంగారుగా అడుగుతూ సిమెంట్ బెంచీ మీదినుంచి లేచాడు బసవప్ప.

తేళ్ళమంద మీద దూకే అడవిజంతువు మాదిరి అతివేగంగా పోయి షెడ్‌లో అడుగుపెట్టాడు వెట్టి.

"పదండి. అందరూ బయటికి పదండి. ఇక్కడ కరెంటు వైరు ఏదో షార్ట్ సర్క్యూట్ అయినట్టుంది" అంటూ అందరికంటే ముందుగా బయటికి రాబోతున్నాడు బసవప్ప.

పిడికిలి బిగించి కొట్టాడు వెట్టి. పళ్లు బిగించి, గుండెల్లో గూడు కట్టుకుని ఉన్న పగనంతా ఆ పిడికిటిలో ప్రతిక్షేపించుకుని మరీ కొట్టాడు.

బాధని భరించటం అసాధ్యమైపోయింది కాబోలు, బిగ్గరగా అరవటానికి నోరు తెరిచాడు బసవప్ప. శబ్దం బయటికి రాకముందే, గిర్రున తిరిగినట్లున్నాయి కళ్లు. కాళ్లల్లోని శక్తి నశించిపోయినట్లు, నిలుచున్న పళాన కిందికి జారిపోయాడు.

అతనిమీది నుంచి ఎగిరి అవతలకి దూకాడు వెట్టి. తన వేగాన్ని, తన ఆవేశాన్ని కొంచెంగా కూడా తగ్గించుకోకుండా మిగిలినవారిమీద కలబడ్డాడు.

"ఎవరు? ఎవర్రా? ఎవరు" కంగారుగా అంటూ తమ మీదికి వచ్చిన వెట్టిని క్లోజ్‌గా చూడటానికి ప్రయత్నం చేశారు వాళ్ళు.

బసవప్ప మీది నుంచి అవతలికి దూకిన వెంటనే వారిలో ఒకణ్ణి కిందికి దొర్లిం చేశాడు వెట్టి. అతని చేతిలో నుంచి కిందికి జారిపోతున్న ఐరన్ రాడ్‌ని గబుక్కున స్వాధీనం చేసుకుని, జాలి, దయ అనే మాటలకు అర్థం తనకు తెలియనట్లు రెచ్చిపోయాడు.

అటువంటి సిచ్యుయేషన్ ఎదురుపడుతుందని ఏమాత్రం ముందుగా తెలిసినా, మొండిధైర్యంతో ఎదురుదెబ్బ తప్పకుండా తీసిఉండేవాళ్లు షెడ్‌లో ఉన్న ఆ హీరోలు. వెట్టి చేతికి దొరికిన ఐరన్‌రాడ్ కంటే బలమైన ఆయుధాలే ఉన్నాయి వారందరి దగ్గరా.

కేవలం పదిక్షణాలు. పదంటే పదిక్షణాలు పట్టింది వారికి, తమని తాము ఫైటింగ్‌కి సిద్ధం చేసుకోవటానికి. కాని ఈ లోపల జరుగవలసిన డామేజీ జరగనే జరిగిపోయింది.

తలలు పగిలిపోయాయి ముగ్గురికి. ముఖాలు తీవ్రంగా గాయపడ్డాయి ఇద్దరికి. కుడిభుజం ఫ్రాక్చర్ అవడంతో బాధ భరించలేక గావుకేకలు పెడుతూ బయటికి పరిగెత్తాడు ఆఖరి మనిషి.

అతని కేకలు రోడ్డుమీదకి పోయిన వారిని ఆకర్షించి, షెడ్ దగ్గరికి రప్పిస్తాయని వెట్టికి తెలుసు. ఎంత సడెన్‌గా షెడ్‌లోకి పోయాడో అంతే సడన్‌గా మళ్ళీ బయటికి

పరుగెత్తాడు. పరిగెత్తుతూ పరిగెత్తుతూ షెడ్ ద్వారం దగ్గర పడిపోయిన బసవప్ప మాడు పగిలిపోయేటట్టు ఒక బలమైన దెబ్బ వేసి మరీ పరిగెత్తాడు.

* * *

"వెతకాలి. ఈ చుట్టుపట్ల మొత్తం గాలించాలి. పదండి పదండి" రోడ్డుమీది నుంచి ఆఘమేఘాల మీద వచ్చి, జరిగింది ఏమిటో ప్రత్యక్షంగా చూసి విపరీతమైన కోపంతో రంకెలు పెట్టాడు ఒక దృఢకాయుడు.

"అడుగో... అడుగడుగో..." అంటూ పక్కకు చేయి చూపించాడు మరో దృఢకాయుడు.

పగబట్టిన పాముల మాదిరి తలలు తిప్పారు మిగిలినవారు. తమ దగ్గర ఉన్న ఆయుధాల్ని బిగించి పట్టుకుని అటుకేసి జంప్ చేయబోయి చటుక్కున ఆగిపోయారు.

పొడుగాటి టార్చిలైటును ముందుకు ఫోకస్‌చేస్తూ, పరుగులాంటి నడకతో వస్తున్నాడు ఆలయంలో అమ్మవారికి పూజలు చేసే పూజారయ్య.

"ఏమయింది బాబులూ? ఏంటి గందరగోళం? ఏం జరిగింది?" అని అడుగుతూ టార్చి వెలుగులో అక్కడ జరిగిందేమిటో చూసి అదిరిపడ్డాడు.

"దెబ్బలు చాలా బలంగా తగిలాయ్. కట్టు కట్టకుండా దిక్కులు చూస్తున్నారు. చచ్చిపోతారు. అన్యాయంగా మట్టిలో కలిసిపోవాలి" ఆందోళన నిండిన కంఠంతో అన్నాడు.

అతను అలా చెప్పినప్పుడు గమనించారు రోడ్డుమీది నుంచి వచ్చినవాళ్లు. తమ వారికి తగిలిన దెబ్బల్ని.

ఎర్రటిరక్తం ధారలు ధారలుగా కారి దుస్తుల్ని తడిపేయటమే కాదు, షెడ్‌లో మడుగులు కట్టబోతున్నది.

కళ్లు తేలవేయటానికి సిద్ధంగా ఉన్నారు తలలు పగిలినవాళ్లు. తెలివితప్పి పడిపోయారు ముఖాలు పగిలినవాళ్లు. బసవప్ప పరిస్థితి అందరికంటే దారుణంగా ఉన్నది. కాళ్లూచేతులూ విరిగిపోయిన ఆటబొమ్మమాదిరి అడ్డదిడ్డంగా పడిపోయి ఉన్నాడు.

* * *

"ఏంటిరా? ఏం మాట్లాడుతున్నావ్? తలలు పగలటం ఏందిరా? ఏమయింది మీరు వెళ్ళిన పని?" అయోమయం, అహంకారం, అమితమైన కోపం కలగలసిన కంఠంతో బిగ్గరగా అరిచాడు బాజిరెడ్డి.

తాము రోడ్డుమీదికి పోయిన దగ్గర్నించీ మొదలుపెట్టి, మళ్ళీ షెడ్ దగ్గరికి వచ్చిన సంగతి వరకూ వివరంగా చెప్పాడు ఆ దృఢకాయుడు.

"బసవప్ప ముఖం మీద నీళ్ళు బకెట్‌తో పోసినా కూడా తెలివిరావటం లేదు. తూలిపోతున్నారు మనవాళ్ళు అందరూ. భుజం విరిగిన వాడి గోల భరించటం చేతకావటం లేదు. అర్జంటుగా హాస్పిటల్‌కి తీసుకువెళ్ళాలి. లేకపోతే ముగ్గురో నలుగురో చచ్చిపోవటం ఖాయం" తన నిర్ణయాన్ని తెలియచేశాడు.

"వాడు.. వాడు ఎవడో చూశారా?వాడే చప్పుడు చేయకుండా వచ్చి మీ బుర్రలు పగలగొట్టాడా?" అడిగాడు బాజిరెడ్డి.

"కటిక చీకటి. షెడ్‌లో లైటు పగిలిపోయింది. వాడు ఎవరో ఎవరికీ తెలియదు" అన్నాడు ఆ అనుచరుడు.

"వాడేరా... తప్పకుండా వాడే! మీరు ఒక పని చేయండి. తెల్లారింది కదా.. వాడు గుడి దగ్గరికి రాగానే కమ్ముకుని నరికి పారేయండి. తర్వాత జరగాల్సింది నేను చూసుకుంటాను" పట్టుదలగా అన్నాడు బాజిరెడ్డి.

"అయ్యా... సారూ... ఈలోపల ఈళ్ళందరూ గుటుక్కుమంటారు. ఒక్కళ్ళు కూడా మనకి దక్కరు" కంగారుగా అన్నాడు ఆ మనిషి.

"అంతమంది ఉండి కూడా ఒక్కణ్ణి పడగొట్టలేక పోయారంటే మిమ్మల్ని చింతబరికెలతో బాదించాల్సిందే. బుద్ధిలేని గాడిదలు. దున్నపోతులు" కచ్చగా అన్నాడు బాజిరెడ్డి.

"ఇంతమందిని కొట్టడం ఒక్కడి వల్ల జరిగే పని కాదు సారు. కనీసం నలుగురైనా వచ్చి ఉంటారు" అన్నాడు అతను.

"నువ్వు చూశావా?"

"లేదు సారు. భుజం విరిగినోడు చెపుతున్నాడు. ఆడు, ఆడిపక్కన ఉన్నోడు ఇద్దరిమీదా ఒకేసారి పడ్డాయట దెబ్బలు"

"ఏడిచాడు, ఎదురుదెబ్బ తీయటం చేతకాక కాకమ్మ కథలు చెపుతున్నాడు" అన్నాడు బాజిరెడ్డి.

"ఏదో ఒకటి చెప్పాడు గాని, ముందు మేము ఈడనించి వచ్చేయాలి. హాస్పిటల్‌కి పోయితీరాలి. దాన్ని గురించి చెప్పండి" ధైర్యంచేసి ఎదురు మాట్లాడాడు ఆ అనుచరుడు.

"నేను జీప్ పంపిస్తాను. అది వచ్చేసరికి బాగా ఆలస్యం అవుతుంది. ఈలోపు గుడికి వచ్చేవాళ్ళు ఏదైనా బండితో వస్తే నాపేరు చెప్పి అందులో బయలుదేరండి" చెప్పాడు బాజిరెడ్డి.

చేతిలో ఉన్న తన ఫోను విసురుగా ఎదుట ఉన్న టేబుల్ మీదికి విసిరి, విసవిసా ఆ గదిలో నుంచి బయటికి వచ్చాడు బాజిరెడ్డి.

ఆ బిల్డింగ్ ముందుభాగంలో ఉన్న హాలువంటి పెద్దగదిలో ఒక సోఫాలో పడుకుని గురకపెడుతున్నాడు అతని డ్రైవర్.

వేగంగా పోయి అతని భుజంమీద చాచిపెట్టి కొట్టాడు బాజిరెడ్డి.

అదిరిపడి కళ్ళు తెరిచాడు డ్రైవర్. "ఏంటి సారు? ఏమైంది" అని అడుగుతూ లేచి నిలుచున్నాడు.

"వాడు... ఆ ఊరూ పేరూ లేని సన్నాసి మళ్లా మన చేతుల్లో నుంచి జారి పోయాడు. గుడి దగ్గరికి పోయిన మన వాళ్ళందరి తలలు పగిలిపోయాయట. వెంటనే తీసుకువచ్చి, వైద్యం చేయించకపోతే ప్రాణాలకే ప్రమాదమట" చెప్పాడు బాజిరెడ్డి.

"నిన్న సాయంత్రమంతా తాగి తందనాలాడిన ఆడు అంతమందిని అలా ఎలా కొట్టగలిగాడు సారు? చిన్నసారుకు కూడా తగిలాయా దెబ్బలు?" ఆశ్చర్యంగా అడిగాడు డ్రైవర్.

"ముందు నువ్వు జీప్ తీసుకుని గుడి దగ్గరికి పోయిరా... మిగిలిన మాటలు ఇప్పుడుకాదు. తర్వాత..." ఆర్డర్ ఇచ్చాడు బాజిరెడ్డి.

నిద్రకళ్ళను నీళ్ళతో శుభ్రం కూడా చేసుకోకుండా భవనం ఎదుట నిలబెట్టి ఉంచిన ఒక జీప్ దగ్గరికి పరుగెత్తాడు డ్రైవర్.

* * *

రేకుల షెడ్‌కి ఆపోజిట్ దిశలో, ఆలయానికి వందమీటర్ల దూరంలో ఉన్న ఒక చిన్నమండపం వంటి కట్టడంచాటున కూర్చున్నాడు వెట్టి.

జనం అయితే అతనికి కనిపించే అవకాశం లేదు గాని, అప్పుడప్పుడు అతని చెవులకు చేరుతోంది షెడ్ దగ్గర స్టార్ట్ అయిన గందరగోళం.

టార్చిలైటు పట్టుకుని వచ్చిన పూజారయ్య మాటల్ని విని, తలలు పగిలిన వారికి తమ పంచెల్ని, తుండుగుడ్డల్ని చింపి కట్టు కట్టారు రోడ్డుమీది నించి వచ్చినవాళ్ళు.

బాజిరెడ్డికి ఫోన్‌చేశాడు వారిలో ఒకతను. దైవదర్శనానికి వచ్చిన ఒక భక్తుడిని బతిమాలి అతను ఏ వెహికల్‌లో వచ్చాడో ఆ వెహికల్‌ను తీసుకొని, తన వారందరితో రోడ్డుమీదికి వెళ్ళిపోయాడు.

బసవప్ప ముఖం మీద అదేపనిగా నీళ్ళుపోసినా అతనిలో కదలిక లేదనే మాట చెవులపడినప్పుడు చెప్పలేనంతగా సంతోషపడింది వెట్టి హృదయం. కూర్చున్న చోటినుంచి లేచి నెమ్మదిగా ఆలయం దగ్గరికి బయలుదేరాడు.

శివారెడ్డి సారుకి మాట ఇచ్చినట్టు ఆలయం తలుపులు తెరిచీ తెరవగానే మొట్ట మొదటిగా లోపలికి పోవటం మాత్రం అతనికి చేతకాలేదు. తన వెహికల్‌ని దృఢకాయులకు అప్పచెప్పిన భక్తుణ్ణి స్వయంగా వెంటబెట్టుకుని తీసుకుపోయాడు పూజారయ్య.

"అరగంట పడుతుంది ఈ సారు పేరిట పూజ జరిపించటానికి. కుదురుగా కూర్చో... నేనే వచ్చి పిలుస్తాను" గోపురాన్ని దాటి గర్భగుడి దగ్గరికి రాబోతున్న వెట్టిని దూరంలో ఉండగానే ఆపి మరీ చెప్పాడు పూజారయ్య.

ఎప్పుడు నిర్మించబడిందో ఎవరికీ తెలియని ఆ చిన్న దేవాలయం చుట్టూ ఒక ప్రదక్షిణం చేశాడు వెట్టి.

ఎక్కడచూసినా పడగలు విప్పి బుసలు కొడుతున్న నాగుపాముల బొమ్మలే ఉన్నాయి. గుడి గోడల మీద చెక్కిన దేవతాశిల్పాల తలల మీద కూడా కనిపిస్తున్నాయి పడగలు.

"ఎక్కడినుంచి వచ్చారు సారూ? ఇదే మొదటిమారు రావటమా?" ఉన్నట్లుండి ఒక కంఠం వినబడేసరికి, ఉలిక్కిపడ్డాడు అతను.

"చెప్పాపెట్టకుండా వచ్చి అనవసరంగా బెదరగొట్టినట్టున్నాను. క్షమించాలి సారు" వెంటనే క్షమాపణలు చెప్పుకున్నాడు అతన్ని మాట్లాడించిన మనిషి.

ఎనభై సంవత్సరాల వయసుకు ఇంకో రెండుమూడు ఏళ్లు ఎక్కువే ఉంటాయని పించేటట్లుంది అతని రూపం. ముడతలు పడిపోయి ఉంది ముఖం. చీపురుపుల్లల మాదిరి సన్నగా కనిపిస్తున్నాయి కాళ్లూ చేతులూ.

"నువ్వు ఎవరివి తాతా?" తన ఉలికిపాటు నుంచి తేరుకుని ఆదరంగా అడిగాడు వెట్టి.

"ఇరవై సంవత్సరాల క్రితం వరకూ ఇక్కడ పూజారిని. కాళ్లు చేతులూ పట్టుతప్పి, కళ్లు కూడా సరిగ్గా కనిపించకపోవడంతో, ఉద్యోగం ఊడిపోయింది" చెప్పాడు ఆ వృద్ధుడు.

పాంటు జేబుల్లో చేతులు పెట్టుకుంటూ కనులు చిట్లించి చూశాడు వెట్టి అతని ముఖంలోకి.

"ఏమిటి సారూ? అలా చూస్తున్నావేమిటి?" కొంచెం అనీజీగా అటూ ఇటూ కదులుతూ అడిగాడు ఆ మనిషి.

"ఇరవై సంవత్సరాల క్రితం అంటే అప్పటికి మీకు అరవైకి ఒకటో రెండో ఎక్కువో తక్కువో ఉండి ఉండవచ్చు. ఆ వయసు మీ వృత్తిలో ఎక్కువ అంటే నమ్మబుద్ధి కావటం లేదు. మీ కనుచూపు ఇప్పుడు కూడా బాగానే ఉన్నట్టు అనిపిస్తోంది" గర్భగుడి వెలుపలి గోడను ఆనుకుంటూ సూటిగా అన్నాడు వెట్టి.

"కనిపిస్తున్నదో లేదో చెప్పవలసింది నేను. మీరు కాదుగదా సారూ?" కొంచెం ఉక్రోషంగా అన్నాడు అతను.

నవ్వాడు వెట్టి. "ఉద్యోగం ఊడిపోయిన తర్వాత మరి జీవనోపాధి ఏమిటి తాతా? ఏం చేస్తున్నావు? అని అడిగాడు.

"చిన్నప్పటి నుంచీ ఈ గుడిని, ఈ గుడిలోని తల్లిని నమ్ముకుని బతికినవాణ్ణి. కొత్తగా ఏదైనా చేయటానికి అవసరమైన చదువు సంధ్యలు లేనివాణ్ణి. ఈ గుడి ధర్మకర్తలు ఎన్ని అభ్యంతరాలు వెలిబుచ్చినా ఈ గుడినే నమ్ముకుని బతుకుతున్నాను. నీ వంటి భక్తులు దయతలచి ఇచ్చే ధర్మంతో రోజులు గడుపుకుంటున్నాను" ఎటువంటి శషభిషలు లేకుండా సూటిగా తాను అతన్ని పలకరించటానికి కారణాన్ని చెప్పేశాడు ఆ వృద్ధుడు.

"ఈ మాట నాకు బాగా నచ్చింది తాతా. లేనిపోని కబుర్లు చెప్పకుండా అసలు విషయం బయటపెట్టావు" అంటూ ప్యాంటు జేబులో నుంచి నోట్ల పొత్తికను బయటికి తీశాడు వెట్టి.

అందులో నుంచి ఒక పెద్దనోటును అతనికి అందించబోతూ, మధ్యలో ఆగాడు.

చేతిని జాచబోతూ, తనుకూడా ఆగిపోయాడు వృద్ధుడు. "ఏంటిసారూ? ఏదైనా అనుమానం వచ్చిందా?" అయోమయంగా అడిగాడు.

"తాతా... చిన్నప్పటినుంచీ ఇక్కడే బతుకుతున్నట్టు చెప్పావు నువ్వు" అన్నాడు వెట్టి. అవునన్నట్టు తల ఊపాడు వృద్ధుడు.

"నాగుపాము రూపంలో ఉండే ఆ దేవత గురించి నాకు కాస్తంత వివరంగా చెపుతావా?" అడిగాడు వెట్టి.

మాయమైపోయింది ఆ మనిషి ముఖంలోని అయోమయం. భక్తో, తన్మయత్వమో ఏదో ఒక చక్కటి భావం దాని స్థానంలో ప్రత్యక్షం అయింది.

"దయగల తల్లి... తనను నమ్ముకున్నవారిని కంటికి రెప్పమాదిరి కాచుకుంటుంది. ఉదాహరణ కావాలంటే నీకు ఎదురుగానే ఉంది" అన్నాడు.

"నా ఎదురుగా ఏముంది తాతా? నువ్వు ఒక్కడివే ఉన్నావు" ఆశ్చర్యంగా అన్నాడు వెట్టి.

"నేనే సారూ. ఉద్యోగం ఊడి ఇంతకాలం అయినా, పస్తులుండి కాటికి పోకుండా నీ వంటివారిని పంపించి నన్ను కాపాడుతూనే ఉన్నది" భక్తిగా చెప్పాడు అతను.

"తనని నమ్ముకున్నవాళ్ళకి ఏదో పాము కనిపిస్తుందని నాతో ఎవరో అన్నారు. అది నిజమేనా?" అడిగాడు వెట్టి.

"ముమ్మాటికీ నిజం సారూ! కాని ఎంతో పెట్టిపుట్టినవాళ్ళకే తప్ప మరెవ్వరికీ కనిపించదు. నూటయాభైకి మించిన సంఖ్యలో పుట్టలు ఉన్నాయి ఈ చుట్టుపట్ల. నెలరోజుల పాటు  నిలబడి చూసినా ఒక్కటంటే ఒక్కపాము కూడా ఎవరికీ కనిపించదు" అన్నాడు అతను.

"ఒకవేళ పొరపాటున కనిపించిందనుకో.. అప్పుడు?" కుతూహలంగా అడిగాడు కొంచెం ముందుకు వంగుతూ వెట్టి.

"మంచి జరగవలసి ఉన్నప్పుడు, మనం ఆ మంచిని అనుభవించే దారిలో కాకుండా వేరేదారిలోకి పోతున్నప్పుడు హెచ్చరించటానికి కూడా కనిపిస్తుంది" అన్నాడు వృద్ధుడు.

సాలోచనగా తల ఊపాడు వెట్టి. తను చేతిలో పట్టుకున్న కరెన్సీ నోటుకు మరో రెండు నోట్లు కలిపి అతని చేతిలో పెట్టాడు.

సరిగ్గా ఆప్పుడే గర్భగుడిలో నుంచి బయటికి వచ్చాడు పూజారి. "ఆ పిచ్చివాడితో మాటలు దేనికి సారూ! వచ్చేయండి. అతిగా మాట్లాడితే అదేపనిగా కథలు చెపుతూ ఉంటాడు" అంటూ చేయెత్తి అతన్ని పిలిచాడు.

తనని పిచ్చివాడుగా సంభోధించినందుకు కొంచెంగా కూడా బాధపడలేదు వృద్ధుడు. "అందరం పిచ్చివాళ్ళమే... లోతుగా తరచిచూస్తే ఈ ప్రపంచంలోని వారందరికీ ఏదో ఒక పిచ్చి ఉండే ఉంటుంది" తనలో తాను అనుకుంటున్నట్టు పైకే అంటూ రాజగోపురం వైపు వెళ్ళిపోయాడు.

అతను గతంలో ఇక్కడ పూజారిగా పనిచేశారట కదా. నిజం కాదా?" లోపలికి పోయి, దేవతామూర్తికి నమస్కారం చేస్తూ అడిగాడు వెట్టి.

"నిజమే సారూ... మహానిష్ఠగా పూజలు చేయించేవాడు. ఏమయిందో ఏమోగాని ఒకసారి ఈ తల్లిని నోటికి వచ్చినట్టు మాట్లాడటం మొదలుపెట్టాడు. ధర్మకర్తలకు కోపం వచ్చి బయటికి పంపించివేశారు" పూజ మొదలుపెడుతూ చెప్పాడు పూజారి.

విగ్రహం తలమీద ఉన్న ఐదు తలల పడగను చూస్తూ, ఓపికగా నిలుచున్నాడు వెట్టి. "శివారెడ్డిసారు గారి తండ్రి ధర్మాత్ముడు. తండ్రి మాదిరిగానే ఆయనకు కూడా

ఈ దేవతంటే అమితమైన భక్తి" పూజ పూర్తి చేసి, తీర్థప్రసాదాలను అతనికి ఇస్తూ చెప్పాడు పూజారి.

అతను అందించిన పాలిథిన్ సంచిలో దేవత కుంకుమను, ప్రసాదాన్ని భద్రపరిచి, ప్యాంటు జేబులో పెట్టుకుంటూ బయటికి వచ్చాడు వెట్టి.

"అయిదుగురు భక్తులు వస్తారు ప్రతిరోజు. ఈరోజున మీరు ఇద్దరే వచ్చారు" గర్భగుడి మంటపంలో ఒక పక్కన కూర్చుంటూ అన్నాడు పూజారి.

"ఇందాక నేను మాట్లాడిన ముసలాయన ఎక్కడ ఉంటాడు?" తను కూడా ఒక పక్కన కూర్చుంటూ అడిగాడు వెట్టి.

"ఇక్కడే.. ఈ పక్కనే చిన్న పెంకుటిల్లు ఉంది. ఒంటరివాడు... వయస్సు మీద పడుతున్నవాడన్న జాలితో ధర్మకర్తలు అందులో ఉండనిస్తున్నారు" చెప్పాడు పూజారి.

"పెళ్ళాం పిల్లలు, సొంత కుటుంబం..." అంటూ మాటని ఆపాడు వెట్టి.

""భార్య లేదు. చాలాకాలం క్రితమే కాన్పు కష్టమై కాలం చేసింది. ఒక్కతే ఆడబిడ్డ. మహా అందంగా ఉండేదిట. పద్దెనిమిది సంవత్సరాల వయసున్నప్పుడు ఏదో జబ్బుచేసి కాలధర్మం చెందిందట" చెప్పాడు పూజారి.

"భక్తుల కోరికలు తీర్చే మహాత్యం కలిగిన ఈ దేవత చూస్తూ ఊరుకున్నదా? తన పూజారికి అటువంటి కష్టం రాకుండా అడ్డం పడలేదా?" ఆశ్చర్యంగా అడిగాడు వెట్టి.

సమాధానం చెప్పటానికి నోటిని తెరిచి, అంతలోనే మాటను మింగేశాడు పూజారి. "అదుగో... ఇంకో భక్తుడు వస్తున్నాడు. కబుర్లు చెపుతూ కూర్చునే వ్యవధి లేదు" అంటూ గబుక్కున లేచి లోపలికి వెళ్ళిపోయాడు.

రాజగోపురంవైపు చూశాడు వెట్టి. వస్తున్నది మరో భక్తుడు కాదు. తనకు మొట్టమొదటిసారిగా పూజచేయించే అవకాశాన్ని లేకుండా చేసిన మొదటి భక్తుడే!

"పూజ పుర్తి అయ్యేలోపల నా వెహికల్‌ని తిప్పి పంపుతామని చెప్పి తీసుకు పోయారు. శివారెడ్డి సారు దగ్గర పనిచేస్తున్న బాజిరెడ్డి మనుషులమని చెప్పారు. ఇంతవరకూ అతీగతీ లేదు. నాకు ఆలస్యం అయిపోతోంది" తనలో తను అనుకుంటు న్నట్టు పైకే అంటూ తను కూడా లోపలికి పోయాడు. తన బాధను అతనితో చెప్పుకోవటానికి కాబోలు.

బాజిరెడ్డి పేరు చెవులపడగానే, ఒంటికి సరిపడని పదార్థం ఏదో నోటిలోకి పోయినట్టు వికారంగా ముఖం పెట్టాడు వెట్టి. మంటపంలో నుంచి లేచి రాజగోపురం వెలుపలికి వచ్చాడు.

అప్పటికప్పుడు తను బుల్లెట్ వదిలిపెట్టిన ప్రదేశంలోకి పోయి, తిరుగుప్రయాణం మొదలుపెట్టాలన్న ఆలోచన అయితే వచ్చింది గాని, అతని అడుగులు మాత్రం ఆలయ ఆవరణ వెనుకభాగం వైపు పడ్డాయి.

ఒకటి రెండు సంవత్సరాల్లో పూర్తిగా శిథిలమై, తనంతట తనే నేలకూలిపోయే టట్లున్న ఒక చిన్న పెంకుటింటి ముందు కూర్చుని కనిపించాడు అతనికి ఆ వృద్ధుడు.

* * *

"బాబాయ్.... బాబాయ్.... ఏం చేస్తున్నావ్?" పెద్ద కంఠంతో అడుగుతూ అవుట్‌హౌస్‌లోకి పరిగెత్తుకు వచ్చినంత పనిచేసింది ప్రణవి.

"పరిగెత్తకు ప్రణవీ. కాలు మెలికపడిందంటే ఇంకోసారి హాస్పిటల్‌ని దర్శించు కోవాల్సి వస్తుంది. నెమ్మదిగా నడువ్. కొంపలు ఏవీ అంటుకుపోవడం లేదు" అంటూ ఆమె వెనుకే ప్రత్యక్షం అయింది ప్రత్యూష.

రమణయ్యపంతులుగారితో కలిసి, అంతకుముందు వెట్టితో ఆడిన మూడు ముక్కల ఆటను ఆడుతున్నాడు శంకరరెడ్డి.

"నిన్న ఆ అబ్బయ్య నా జేబులు ఖాళీ చేసేశాడు. ఏదో తలరాత తిన్నగా ఉండి ఇవాళ కాస్తంత మంచిగా ఉంది హ్యాండు. చెడగొట్టడానికి వచ్చావా?" కోపంగా అడిగాడు.

"సంపంగి ఫోన్లో మాట్లాడుతుంటే ప్రత్యూష విన్నదిట. అక్కడ గుడి దగ్గర వీరభోజుడి జనాన్ని ఎవరో తుక్కుకింద కొట్టి అవతల పడేశార్ట" మహా సంతోషంగా చెప్పింది ప్రణవి.

చేతిలో ఉన్న ముక్కల్ని మహా విసురుగా టీపాయ్ మీద పడేసి చప్పట్లు కొట్టబోయిన శంకరరెడ్డిని వెంటనే అడ్డుకున్నాడు పంతులుగారు.

"సంతోషం వచ్చినా, బాధ కలిగినా నిన్ను పట్టుకోవటం చాలా కష్టం. నిదానించు శంకరరెడ్డి... లేనిపోని బాధలు నెత్తిమీదకు తెచ్చుకోకు" అంటూ చెప్పి, ప్రత్యూషవైపు తిరిగాడు.

"సంపంగి ఏం మాట్లాడింది? ఎవరితో మాట్లాడింది? నువ్వు వినటం ఎలా జరిగింది" అని అడిగాడు.

"సంపంగికి ఆ బాజిరెడ్డి డ్రైవర్‌కి మధ్య బోలెడంత కనెక్షన్ ఉంది. విఠల్‌బాబుకు అనుమానం వచ్చినప్పటి నుంచి నేను తనని కనిపెట్టుకునే ఉంటున్నాను. ఇందాక ఇంటి వెనకాలకి పోయి ఫోన్లో గుసగుసలాడటాన్ని గమనించి కిటికీలో నుంచి విన్నాను" చెప్పింది ఆమె.

"ఏమని విన్నావు?" అడిగాడు శంకరరెడ్డి.

"ఊరు తెల్లారకముందే అక్కడికి పోయాట్ట పఠాన్. మధ్యలో ఎవడో నాగులు గాడట... ఫోన్ చేస్తే వేరే పనిమీద తను ఇంకోచోటికి వెళ్ళిపోయాట్ట. అతను అవతలికి పోవడం, అక్కడ మకాం పెట్టిన వాళ్ళమీద ఎవరో ఎగబడి తలలు పగలగొట్టడం జరిగిపోయిందిట. వీరభోజుడు జీప్ తీసుకుపొమ్మన్నాడట, వాళ్ళందర్నీ తీసుకువచ్చి హాస్పిటల్లో చేర్చటానికి" మెరుస్తున్న కళ్ళతో చెప్పింది ప్రత్యూష.

"విఠల్‌బాబు పనే అంటారా ఇది పంతులుగారూ?" అడిగాడు శంకరరెడ్డి.

"నీకు ఇంకా అనుమానం దేనికి బాబాయ్? అంతమంది దుమ్ము దులపగలిగిన వాడు ఈ చుట్టుపట్ల వేరే ఎవరున్నారు? తప్పకుండా ఇది మన హీరో చేసిన పనే.. సందేహం లేదు" హుషారుగా చెప్పింది ప్రణవి.

"ఇంత డేరింగ్‌గా చేసినవాడు ఆ పఠాన్‌ని మాత్రం అవతలకి పోనివ్వటం దేనికో? వాడిని కూడా రెండు మూడు ఉతుకులు ఉతికినట్లయితే ఇంకా బాగుండి ఉండేది" కచ్చగా అన్నాడు శంకరరెడ్డి.

"ఒట్టొట్టి ఉతుకుల వల్ల ఏమీ ఉపయోగం ఉండదు. పఠాన్ విషయంలో ఏది చేసినా గుక్కతిప్పుకోనివ్వకుండా చేయాలి. ఇంతకీ వాడు అవతలకి పోవటమేమిటో అర్థం కావడం లేదు." సాలోచనగా అన్నాడు రమణయ్యపంతులు.

"ఒకటికి రెండుసార్లు రెట్టించి అడిగింది సంపంగి. సరైన సమాధానం రాలేదు కాబోలు మూతి ముడుచుకుంది" చెప్పింది ప్రత్యూష.

"వీరభోజుడికి చింతలపల్లిలో తోటలున్నాయి. వాటిని నాగేంద్రమనీ, అతని బంధువు ఒకడు మేనేజ్ చేస్తూ ఉంటాడు. బహుశా వాడి దగ్గర్నించి వచ్చి ఉంటుంది ఫోను" అన్నాఎఉ పంతులుగారు.

"మనకి అక్కడ ఆస్తులు ఏమీలేవా?" ఉన్నట్లుండి సీరియస్‌గా అడిగింది ప్రణవి.

"ఇప్పుడు వాడి పేరిట ఉన్నవి ఒకప్పుడు మీవే తల్లీ! ఆ పఠాన్‌గాడు పుట్టినప్పుడు మీ నాన్నగారు ఆ వీరభోజుడికి బహుమతిగా ఇచ్చేశారు. నీకు ఇంకో విషయం చెప్పాలి. మనసులో పెట్టుకో" అన్నాడు పంతులుగారు.

"ఏమిటి పంతులుగారు ఆ విషయం? అంత గొప్పదా?" ఆశ్చర్యంగా అడిగింది ఆమె.

"చింతలపల్లి తోటలు ఇప్పుడు వీరభోజుడివే. నిజానికి వాటిని నోటిమాటగా ఇవ్వటం జరిగింది. కాయితాలు రాయటం, రాయించుకోవటం జరగలేదు. ఇచ్చినప్పుడు వాటి విలువ చాలా తక్కువ. ఇప్పుడైతే లక్షల్ని దాటిపోయినయ్"

చెప్పాడు రమణయ్యపంతులు గారు.

"అయితే కామ్‌గా కూర్చోవటం దేనికి? లాగేసుకుంటే ఒక పని అయిపోతుంది కదా!" అన్నది ప్రణవి.

"ఎలా లాక్కుంటావు తల్లీ? ఏ విధంగా లాక్కుంటావు? నిన్ను తన కోడలిగా చేసుకుని ఈ చుట్టుపట్ల ఉన్న ఆస్తుల్ని కూడా కబ్జాచేయటానికి చూస్తున్న ఆ నయవంచకుడిని బోల్తా కొట్టించటం తేలిక అనుకుంటున్నావా?" అడిగాడు పంతులుగారు.

తన పెళ్ళిమాట బయటికి వచ్చేసరికి చిన్నబోయింది ప్రణవి ముఖం. కళ్ళవెంట గిర్రున తిరిగాయి కన్నీళ్ళు.

"ఏడవకు ప్రణవమ్మ. ఏమీ కాదు. మీ అమ్మ ఇక్కడికి రానంతవరకూ వీరభోజుడు చేయగలిగింది ఏమీ లేదు. వాడు తల నేలకేసి కొట్టుకున్నా సరే, ఆ తల్లి ఇటుకేసి కన్నెత్తి కూడా చూడదు" చటుక్కున లేచి ఆమె భుజం తడుతూ అనునయించాడు శంకరరెడ్డి.

అతని మాటలు పూర్తి అవుతూ ఉండగానే మోగటం మొదలుపెట్టింది జేబులో ఉన్న ఫోను. బయటికి తీసి నెంబర్‌ని చూసి, చటుక్కున నాలుక కరుచుకున్నాడు.

"నిన్న మీరి కదిరిస్వామి గుడికి పోయినప్పుడు పెద్దమ్మ ఫోను చేసి నిన్ను మాట్లాడించమంది. మర్చిపోయాను. ఇదిగో మాట్లాడు" అంటూ ప్రణవికి అందించాడు.

"అమ్మమ్మా... ఏం చేస్తున్నావు? ఎలా ఉన్నావు?" చెవి దగ్గర పెట్టుకుంటూ గారాబంగా అడిగింది ప్రణవి.

"నీకసలు బుద్ధి ఉందా? వెళ్ళిన తర్వాత ఫోను చేసి మాట్లాడాలనే జ్ఞానం లేదు? నేనుచేస్తే ప్రేమ ఒలకబోస్తున్నావా?" కోపంగా వినవచ్చింది పెద్దమ్మ కంఠం.

"సారీ అమ్మమ్మా! ఇక్కడ అంతా గందరగోళంగా ఉంది. అన్నయ్యని హాస్పిటల్‌కి తీసుకుపోవటం, తీసుకురావటం అదో పెద్ద అడ్వెంచర్! అమ్మ ఎలా ఉంది?" అడిగింది ప్రణవి.

"అది చెప్పటానికే చేశాను. అమ్మ ఇప్పుడు ప్రయాణం అవుతోంది. తనంతట తను అక్కడికి వచ్చేస్తోంది. రెడీగా ఉండండి" అన్నది పెద్దమ్మ.

పిడుగుపడినట్లయింది ప్రణవికి తన నెత్తిమీద. "అమ్మమ్మ... ఏమంటున్నావు నువ్వు?" అమ్మ వచ్చేస్తోందా? ఇక్కడికా?" తను తప్పుగా విని ఉండటం జరిగిందేమోనన్న ఆశాభావంతో రెట్టించింది.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Vetti+2**

* * *